# జ్ఞానోదయం

షణ్ముఖం ఉలిక్కిపడి నిద్రలేచాడు.

ఆదిలక్ష్మి పాలవాడితో ఘర్షణ పడుతూ వుంది. విసుగ్గా మంచం దిగాడు షణ్ముఖం. అప్పటికే బారెడు పొద్దెక్కింది. గబగబా బాత్ రూం లోకి నడిచాడు.

ఇవ్వాళ ముప్ఫై ఒకటో తారీఖు. సాయంత్రంలోగా పని పూర్తి చేసి ఆఫీసరుకు చూపించకపోతే తను వినాల్సిన మాటలు ఆ భగవంతుడికే తెలుసు! ఆఫీసర్ మరి! ఏమైనా అంటాడు. తను ఆఫ్టరాల్ ఒక ఎన్.జీ.ఓ. ఏమన్నా తల వంచుకొని పడాలి. తలెత్తి వినకూడదు.

త్వరత్వరగా స్నానం ముగించాడు. నాలుగు పచ్చడి ముద్దలు మింగి ఆఫీసుకు బయలు దేరాడు.

"ఏమండీ?"

గడప దాటుతున్న షణ్ముఖం ఆగాడు. విసుగ్గా భార్య ముఖంలోకి చూశాడు.

"ఇవ్వాళన్నా పెందాలాడే వస్తారా?"

షణ్ముఖానికి వళ్ళు మండి పోయింది.

"మాట్లాడరేం ? దీనంగా అన్నది ఆదిలక్ష్మి. షణ్ముఖం మాట్లాడలేదు.

"నిన్న కూడా పాపకు మందు లేదు. పిల్లవాడికి కోరింత దగ్గు ఎక్కువైంది."

షణ్ముఖం భార్య ముఖంలోకి చూశాడు.

ఆమె చూపులు అతని గుండెలకు తుమ్మ ముళ్ళలా గుచ్చు కున్నాయ్. అపరాధిని చూసినట్లు చూస్తుంది భర్తను భార్య.

"మాట్లాడరేం ?"

తను 'ఏం మాట్లాడాలి'? తను రావాలని రోజు ఆలస్యంగా వస్తున్నాడా ? తనకేదో ఆకర్షణ వుండి కూర్చుంటున్నాడా? తనేమన్నా ఆఫీసరా కావాలన్నప్పుడు సీట్లో నుంచి లేచి 'వచ్చి' గవర్నమెంటు కార్లో దర్జాగా కూర్చుని బయలు దేరటానికి ? దీనికి బొత్తిగా బుద్ధిలేదు. తన గురించి బొత్తిగా ఆలోచించదు.

"మాట్లాడరేం? ఒక వైపు చిన్న వాళ్ళిద్దరికి జబ్బులు మీ అమ్మగారికి తన పూజలతోనే సరిపోతుంది. ఇంటెడు చాకిరీతో సతమతమై పోతున్నాను. మీరేమో రాత్రి తొమ్మిదింటిదాకా రారాయె! పెళ్ళాం బిడ్డలు గుర్తున్నట్లే వుండాదా మీకు ?"

"అయిందా ?" కోపంగా అన్నాడు.

ఆదిలక్ష్మి కళ్ళల్లో నీరు తిరిగింది.

"మీకు బొత్తిగా మా గురించి ఆలోచనే వుండదు." ఆదిలక్ష్మికి దుఃఖం పొర్లుకొచ్చింది. ఆ పైకి మాట్లాడలేక పోయింది. "ఛీ! ఛీ! ఇదొకటి! నీళ్ళకుండ ఎప్పుడూ నెత్తినే వుంటుంది. నా బిడ్డలూ నేనూ, మీకు అంత బరువై పోయామా" ఏడుస్తూనే అన్నది భార్య.

దీని బిడ్డలట! తన బిడ్డలు కారూ! తన పెళ్ళాం అన్నా తన పిల్లలన్నా తనకు పట్టటంలేదా? వాళ్ళు తనకు బరువు అనుకుంటున్నాడా? అలా అనుకుంటే ఏనాడో ఈ బాధ్యతల నుండి పారిపోయేవాడు! దీనికి ఆ మాత్రం జ్ఞానం లేదు.

ఆదిలక్ష్మి కళ్ళు తుడుచుకుంది.

ముందు ఏడుపు పుట్టి ఆ తర్వాత ఇది పుట్టింది. దీని బతుకంతా ఏడుపే. ఈ ఇంటి కప్పూ గోడలూ దీని కన్నీళ్ళతో నాని నాని కూలిపోతాయి.

షణ్ముఖం రెండడుగులు ముందుకు వేశాడు.

"నా గోడు ఆలకించే వాళ్ళే లేరు." ఎక్కిళ్ళ మధ్య నుంచి ఆదిలక్ష్మి. కంఠం.

ఓ భగవంతుడా! ఎక్కడున్నావయ్యా? ఒక ఏనుగు పక్షిస్తేనే 'సిరికిం జెప్పడు - శంఖు చక్ర యుగమున్ చేదోయి సంధింపడు ..." ఇంకా ఏమేమో వదిలేసి పరిగెత్తుకొచ్చావటగా? నువ్వు ఆపద్బాంధవుడివట! కరుణామయు

డివట. ఒక మనిషి అందులో ఆడమనిషి ఏడుపు. ఏనుగు ఏడుపు కదిలించినంత మాత్రం నిన్ను కదిలించ లేక పోతుందా? మరెందుకు రావు? నీ గురించి చెప్పిందంతా అబద్ధమేనా?"

"ఏమండీ"

"ఛ! ఊరుకో, ఎప్పుడూ ఏడుపే వెధవ ఏడుపు ముఖము నవ్వ్వాను! ఆఫీసు పని అయిపోగానే వస్తాన్లే" రెండడుగులు ముందుకు వేశాడు షణ్ముఖం.

"వచ్చేప్పుడు డాక్టరు దగ్గరకెళ్ళి మందు కూడా తీసుకురండి."

"అలాగే." ఎలాగో అనగలిగాడు.

"ఆ మర్చిపోయాను, కాఫీ పొడీ, పంచదార కూడా అయిపోయినై.

"ఊ!" మరో అడుగు ముందుకు వేశాడు.

"పిల్లకు బొత్తిగా ధారకం పోవడం లేదు. ఒక గ్లూకోజ్ డబ్బా. బత్తాయిపళ్ళు ..."

షణ్ముఖం గిరున తిరిగి భార్యముఖంలోకి చూశాడు. "ఊఁ ఇంకా ?"

ఆదిలక్ష్మి భర్త ముఖంలోకి చూస్తూ మాట్లాడలేక పోయింది. ఆ రోజు మున్నెప్పుడు ఒకటో తారీఖుని గుర్తొచ్చి బొమ్మలా నిలబడిపోయింది.

"ఒరె అబ్బాయ్! కందిపప్పూ, పెద్దుల్లిపాయలూ- చింతపండూ తీసుకురారా."

షణ్ముఖం తల్లి మంగమ్మ ఉతికి, పిండిన బట్టలు భుజం మీద వేసుకొని బయటికి వచ్చింది.

షణ్ముఖానికి వెనక్కి తిరిగి తల్లి ముఖం చూసే ధైర్యం లేక వీధిలోకి చూస్తూ నిలబడి పోయాడు.

"ఎటూ మార్కెట్‌కు వెళ్తారుగా కూరగాయలు కూడా పట్టుకు రండి!" పెళ్ళాం గొంతు.

"ఓరే నాయనా. ఓ పాతిక నిమ్మకాయలు కూడా పట్టుకురా! కోసి ఉప్పులో వేస్తాను. నోరు మరీ చవి చచ్చిపోయింది."

"నానోయ్. రంగు పెన్సిళ్ళూ జామెంట్రీబాక్సు... మాష్టారుగారు తిడుతున్నారు"

"ఏమండోయ్ మరి..."

"నానోయ్ మరేమో..."

"ఓరే నాయనా..."

షణ్ముఖం చరచర వెళ్ళిపోయాడు.

రోడ్డుమీద ఉసిగా నడుస్తున్నాడు. చురచుర ఎండ నెత్తి మాడుస్తూవుంది. అరిగిపోయిన చెప్పులు ఎండకు కరిగిన తారుకు మధ్యమధ్య అతుక్కుంటూ వున్నాయి. మైలు దూరం నడవాలి. నటరాజా సర్వీస్ నిగనిగలాడుతున్న నల్లటి

ఎంబాసిడర్ షణ్ముఖం పక్కగా దూసుకుపోయింది. అది ఎవరికారో తెలుసు.

ఆఫీసరు వెళ్ళాడు. తనకు ఇవ్వాళ ఆలస్యం కాక తప్పదు. - నడక వేగం పెంచ్చించాడు.

ఏమిటీ జీవితానికి అర్థం? ఈ బ్రతుక్కు ప్రయోజనం అసలు తను బ్రతికేది కూడా ఒక బ్రతుకేనా?

సెంటర్‌లో కొచ్చేసరికి క్లాక్ టవర్ "టంగ్"న ఒక దెబ్బకొట్టింది శ్రీరామచంద్రమూర్తి విరిచిన శివధనుష్టంకారంలా విన్పించింది షణ్ముఖానికి.

షణ్ముఖం చివ్వున తలెత్తి చూశాడు. సత్యాన్వేణలో పడి విహరిస్తున్న మనసు తార్రోడ్డుమీద సెంటర్‌లో నిలబడిపోయిన అతనిలోకి తిరిగి వచ్చింది.

పదిన్నర!

అమ్మయ్యో. పదిన్నరే?

అప్పుడే పదిన్నర అయింది. ఇంకా అరమైలు నడవాలి. సరిగ్గా బయులుదేరేప్పుడే అందరికి అన్నీ గుర్తొస్తాయి. వాళ్ళకు బొత్తిగా బుద్ధిలేదు.

నల్లత్రాచులా తారురోడ్డు షణ్ముఖం కళ్ళముందు పడుకొని వుంది.

"లేట్! లేట్! యూ ఆర్ ఆల్‌వేస్ లేట్ - బుద్ధిలేదూ! ఇలా అయితే సస్పెండు చేస్తాను..." ఆఫీసరు ఎలుగ్గొడ్డులా అరుస్తున్నట్టు కళ్ళముందు కన్పించాడు.

షణ్ముఖం పరుగులాంటి నడకతో చెమటలు కక్కుతూ ఆఫీసులోకి వచ్చిపడ్డాడు.

మూడుసార్లు లేటయితే ఒక క్యాజువల్లీవు కట్ అవుతుంది ఆ తర్వాత మూడురోజుల లేటుకు ఒకరోజు జీతం కట్. పైగా ఎన్నిమాటలు పడాలి? ఎంత టెన్షన్?

"ఆఫీసరు పిల్చారు." నురగలు కక్కుతూ ఆఫీసులోకి పడ్డ షణ్ముఖంతో అన్నాడు మునుస్వామి.

తను అనుకున్నంతా అయింది. ఆలస్యం అయినరోజే పిలుస్తాడు. తొమ్మిదింటికే వచ్చి కూర్చున్నరోజు ఒక్కసారీ పిలవరు. తను నడుస్తూ రావడం కార్లో వెళ్తూ చూసేవుంటాడు. అందుకే పిల్చివుంటాడు.

"సార్? అయ్యగారు పిలుస్తున్నారు" ప్యూన్ వచ్చి చెప్పాడు. షణ్ముఖం కాళ్ళల్లో వణుకూ, మెదడులో హోరూ ప్రారంభం అయింది.

పులిబోనులోకి వెళుతున్నట్టు గుండె దడదడలాడుతూ వుంటే ఆఫీసరు గదిలోకి వెళ్ళాడు.

"ఏం లేటుగా వచ్చావ్?"

"ఆలస్యం అయింది సార్!"

"ఏమిటా సమాధానం? స్టుపిడ్!"

"ఫూల్" అంటే ఫూల్లాగా స్టుపిడ్ అంటే స్టుపిడ్లా ఆఫీసరు ముందు ముఖం పెట్టడం నేర్చుకుని చాలా కాలం అయింది షణ్ముఖం.

"పలకవేం బుద్ధిలేదూ?"

కథా నిలయం
2064
శ్రీకాకుళం

అయినా మౌనంగానే నిల్చున్నాడు షణ్ముఖం ఆఫీసర్ల ప్రశ్నలకు సమాధానం ఇవ్వకూడదని ఏనాడో తెలుసుకున్నాడు.

"క్యాష్ అంతా వెరిఫై చేసి క్యాష్‌బుక్ క్లోజ్ చేసి సంతకం తీసుకో ఇవ్వాళ ముప్ఫైఒకటో తారీఖని తెలుసుగా?"

"యస్ సార్!"

"వెళ్ళు!"

ఒక్కసారి బయటకు వచ్చిపడి గుండెల నిండుగా గాలి పీల్చుకున్నాడు.

షణ్ముఖం బయటకి వచ్చిపడి తనసీటులో కూలబడ్డాడు. బుర్రంతా గందరగోళంగా వుంది.

ఛీ! వెధవ బ్రతుకు! ఆత్మగౌరవం లేని బతుకెందుకు? సర్వీసులో చేరిన వాడికి ఆత్మగౌరవం వుండకూడదట. రాజీనామా పత్రం రాసి ఆఫీసరుగాడి ముఖంమీదకొట్టి ఇంటికి పోతే...?

"ఏమండీ మందులు తెచ్చారా!"

"కందిపప్పూ చింతపండూ తెచ్చావురా నాయనా?"

"జామెంట్రీ బాక్స తెచ్చావా నాన్నా?"

"చిన్నదానికి ధారకం పోవడంలేదు. గ్లూకోజ్ తెమ్మని చెప్పాను గదండీ."

"అబ్బబ్బ! నోరు ముయ్యండే!" కళ్ళు మూసుకొని నొసలు నొక్కుకొంటూ అరిచాడు షణ్ముఖం.

సెక్షన్లో వాళ్ళంతా ఉలిక్కిపడి చూశారు.

"ఎవర్నండీ!" సహ ఉద్యోగి.

అప్పటికిగాని ఈ లోకంలోకి రాలేదు. ఫిలాసఫీ ఆనర్సు పాసయిన షణ్ముఖం.

"సారీ!" గాడ్రేజ్ తెరిచి ఫైల్సూ క్యాష్‌బుక్కూ, వోచర్లూ, బల్లమీద పెట్టుకోసాగాడు. ఎవరి కేసీ చూడకపోయినా అందరూ తనను చూసి ముసిముసిగా నవ్వుకుంటున్నట్టు అనిపించింది. షణ్ముఖానికి

ఫిలాసఫీ ఆనర్సులో క్లాసు! వెధవక్లాసు ఎందుకు ? తను ఎందుకు బతుకుతున్నాడో ఈ జీవితానికి అర్థ మేమిటో? ఎంత ఆలోచించినా క్రాసువర్డ్ పజిల్‌లా తెగడం లేదు.

కాళ్ళులేక కాదు కాలంవచ్చి చిక్కినట్టు ఫిలాసఫీ గ్రాడుయేట్ ఎకౌంట్సు సెక్షన్‌లో యు. డి. గుమాస్తా అయ్యాడు. అదీ నాలుగేళ్ళ యల్. డి. సీ. గా పని చేస్తేగాని కాలేదు. స్కూలు ఫైనల్ వాడు చెయ్యాల్సిన ఉద్యోగంలో పోస్టు గ్రాడ్యుయేట్ అయ్యే చేరాడు. ఏదో కొంత కాలం పని చేస్తే మంచి ఉద్యోగం రాగానే వెళ్ళిపోవాలనే ఉద్దేశ్యంతోనే చేరాడు. కాని మంచి ఉద్యోగం దొరకడం మాట అటుంచి ఉన్న ఉద్యోగం నిలుపుకోవడానికి తన సర్వశక్తులూ ధారపోసి, ఆత్మాభిమానం చంపుకొని పని చేశాడు. తర్వాత

తీసుకోలేక పోతానా అని ఊబిలో కాలువేశాడు. మొల లోతు దిగబడిపోయాడు.

పొద్దుటినుంచి రాత్రిదాకా చేసినా ఈ పని తెమిలేది కాదు. ఎకౌంట్సు అంటే తనకు మహా చిరాకు. ఫిలాసఫీ చదివిన తనకు అంకెలంటే మరి చిరాకుకదూ?

"ఇవాళ్లైనా పెందలాడే వస్తారా?" రోజూ తన పెళ్ళాం ఇదే ప్రశ్న వేస్తుంది.

సీటులో కూర్చున్నాడేగాని షణ్ముఖం మనస్సులో ఏదో వేదాంతం జీవితపు విలువల తాలూకు ఆలోచనలు ముసురుకుంటున్నాయి. క్యాష్ రిజిష్టరూ కంటింజెంటు రిజిష్టరూ, బిల్లులూ ఓచర్సూ అతని ముఖంలోకి చూస్తున్నాయి.

ఆలోచన - పని - ఒకటి ఉంటే మరొకటి సాగదు. ఆలోచనల్ని బలవంతంగా వెనక్కునెట్టి పనిలో తల దూర్చాడు. ఎంతసేపు చేశాడో అతనికే తెలియదు.

"అయ్యగారు పిలుస్తున్నారు సార్!"

షణ్ముఖం తలెత్తి చూశాడు. వాల్ క్లాక్ నాలుగుం పావు చూపిస్తోంది. ఇంకా పని పూర్తి కాలేదు. మెల్లిగా లేచి ఆఫీసరు గదిలోకి వెళ్ళాడు.

"పూర్తయిందా?"

"ఆఁ అయిపోతూంది సార్."

"ఛ! ఏం మనిషివయ్యా! మనిషి జన్మ ఎత్తావ్ ఎందుకూ! ఎన్నిసార్లు చెప్పించుకుంటావు!"

షణ్ముఖం గుండెలోకి బాకులు గుచ్చినట్టు అన్పించింది.

తను మనిషిజన్మ ఎందుకు ఎత్తాడా?

"రాత్రి ఎంత పొద్దుపోయినా పని పూర్తిచేసి రిజిష్టర్సు ఇంటికి తెచ్చి సంతకాలు తీసుకో!"

షణ్ముఖం ఏదో చెప్పాలనుకున్నాడు.

"ఫో! ఇంకా నిలబడ్డావేం? చీదరించుకొన్నాడు ఆఫీసరు.

"ఇవ్వాళ ఇంటి దగ్గిర అవసరమైన పనివుందిసార్! పిల్లలకు వంట్లో బాగా లేదుసార్" నీళ్ళు నములుతూ అన్నాడు.

"షటప్ ముందు వెళ్ళి పని పూర్తి చెయ్. ఈ సాకులన్నీ నా దగ్గిర సాగవ్. వెళ్ళు."

షణ్ముఖం కాళ్ళీడ్చుకుంటూ బయటకి వచ్చాడు. కారు స్టార్టుఅయినశబ్దం వినిపించింది. ఆఫీసరు వెళ్ళిపోయాడు.

షణ్ముఖం చకచకా రాస్తున్నాడు.

ప్యూన్‌వచ్చి లైటు వేశాడు.

"అందరూ వెళ్ళిపోయారా!" షణ్ముఖం అడిగాడు.

"ఆఁ! ఎస్టాబ్లిష్‌మెంట్ సూపర్నెంటుగారు మాత్రం వున్నారు" అని చెప్పిప్యూన్ వెళ్ళిపోయాడు.

షణ్ముఖం మళ్ళీ ఆలోచనల్లో మునిగి పోయాడు.

వాడు ... పట్టి బి. యే. గాడు, తనను ఏమన్నాడూ! తను మనిషిజన్మ ఎందుకు ఎత్తావన్నాడా! అవును తను మనిషిజన్మ ఎందుకు ఎత్తినట్టు? గాడిదలా చాకిరీ చేయడానికేగా!

మళ్ళీ ఈ రోజూ తొమ్మిదవుతుంది. పెళ్ళాం చిత్కారం, తల్లి సణుగుడు! పిల్లవాడిగోల! పాపకు ఎలా వుందో? పాపం అది మాత్రం ఏం చేస్తుంది?

ఇంటికి వెళ్ళిపోతే! ఎలా! వచ్చేప్పుడు ఏమేమో తీసుకురమ్మని చెప్పారుగా! వట్టి చేతులతో వెళితే ఇంటి దగ్గిర ఎదురయ్యే దృశ్యం కళ్ళకు కన్పించింది.

ఏమైనా ఈ నరకంనుంచి బయటపడాలి. గబగబా రిజిష్టరు మూసేశాడు.

కాని ... మళ్లీ తను వెళ్ళేది మరో నరకంలోకేగా నరకం నుంచి నరకానికి తన ప్రయాణం. ఈ ప్రయాణానికి అంతెప్పుడో!

ఆఫీసు ఒక యంత్రం. అందులో తను ఒక చక్రం. చక్రం గిరగిరా తిరుగుతూ వుంది. దానికి విరామం లేదు. విశ్రాంతి లేదు. మనసు లేదు. మమకారం లేదు. అభిమానం లేదు.

తెల్లరితే ఒకటో తారీఖు అది ఎన్. జీ. ఓ లకు పర్వదినం. కాని ఈ రోజు ఒకటో తారీఖు తనచేతి నిండుగా పదిహేనువేలు జీతాలు పంచుతాడు. అన్ని కట్సు పోగా రెండొందల ఇరవైరూపాయలతో తను ఇంటికి వెళ్తాడు.

"అయ్యగారూ! ఎనిమిదయి పోయిందండీ! అందరూ వెళ్ళిపోయారు." ప్యూన్ అన్నాడు.

"ఎనిమిదయిందా?"

"ఇంటిదగ్గిర కొంచెం—" నసిగాడు ప్యూన్.

"పనివుంది. వెళ్ళు. నైట్ వాచ్‌మన్‌కి తాళాలు నేను ఇచ్చివెళ్తాలే." అన్నాడు షణ్ముఖం.

జవాను నమస్కారం చేసి వెళ్ళిపోయాడు.

షణ్ముఖం మెడమీాద చెయ్యిపెట్టుకొని వెనక్కు విరుచుకున్నాడు. మెడ నొప్పిగావుంది.

ఎదురుగా బోసి నవ్వులతో పలకరిస్తున్న గాంధీ మహాత్ముని పటం కన్పించింది.

ఆ ముఖంలో ఎంత ప్రశాంతతా! నవ్వులో ఎంత చల్లదనం! ఆ కళ్ళలో ఎంత వెలుగు! ఎంత నిరాడంబర జీవి! తనకేం తక్కువని వంటినిండా బట్టకూడా కట్టుకోకుండా సన్యాసిగా బతికాడు? ఎవరికోసం? తనకోసంకాదు. తనదేశం కోసం! తన దేశంలోని ప్రజలకష్టాల నివారణకోసం! ఎన్ని బాధలు పడ్డాడు! ఎన్నిసార్లు జైలుకు వెళ్ళాడు! ధన్యజీవి! మానవజన్మ అంటే అది.

మరి తనో! తన ఇంట్లో వారి కష్టాలను కూడా తీర్చ లేకుండా వున్నాడు. పైగా విసుక్కుంటున్నాడు? తన బిడ్డల్ని తను సుఖ పెట్టలేక పోతున్నాడు.

గాంధీజీ లోక కల్యాణం కోసం జైలుకు వెళ్ళాడు. స్వరాజ్యం తెచ్చాడు. మరి తనూ, తనలాంటి వారూ ఇంకా ఇలాగే వున్నారేం?

క్షణం తీరిక లేని పని, ఎప్పుడూ ఎలుగ్గొడ్డులా అరిచే ఆఫీసరూ, శరీరాన్ని, ఆత్మనూ, అమ్ముకొని సంపాదించే నెల

జీతం రెండువందల రూపాయలూ, క్షణకాలం శాంతి లేని కొంపా, ఎప్పుడూ ఏడుస్తూ ఎదురయే ఇల్లాలూ, సాధించే తల్లీ, అది కావాలి ఇది కావాలి అని ఏడ్చే పిల్లలూ, ఎప్పుడూ రోగాలూ, మందులూ ...

"ఖంగ్ ఖంగ్" చిన్న కొడుకు దగ్గు

"నాన్నా, నాన్నా." జబ్బుతో వున్న చిన్న కూతురి కలవరింత

"జామెంట్రీ బాక్సు" పెద్ద కొడుకు నిద్రలో.

"ఇవ్వాళైనా పెందలాడే వస్తారా ?" కలలో పలకరిస్తూ భార్య.

"ఒరే నాయనా! ఇంట్లో సరుకులు నిండుకున్నాయిరా! "మూగగా తల్లి గొణుగుడు.

షణ్ముఖం చెవులు మూసుకున్నాడు. అయినా మాటలు విన్పిస్తూనే వున్నాయి.

"హే! మహాత్మా. నా కళ్ళు తెరువు. నాకు వెలుగును ప్రసాదించు! నాకు జ్ఞానబోధ చెయ్యి. నన్నేం చెయ్యమంటావ్ ?" గాంధీ మహాత్ముని ఫోటో కేసి చూస్తూ పైకే అన్నాడు షణ్ముఖం.

గోడ గడియారం తొమ్మిది కొట్టింది. క్యాష్ బుక్ క్లోజ్ చేసి క్యాష్ బాక్సు తీశాడు. క్యాష్ లెక్క పెట్టుకున్నాడు. సరి పోయింది. ఆఫీసరు ఇంటికి వెళ్ళాలా వద్దా అనే ఆలోచనలో పడ్డాడు.

మహాత్ముని కేసి చూశాడు. రెండు చేతులూ జోడించి నమస్కరించి స్వామీ! జ్ఞానోదయం అయింది అన్నాడు.

షణ్ముఖం ఇంటికి చేరేప్పటికి పది దాటింది.

అందరూ నిద్రపోయారు.

ఆదిలక్ష్మి మాత్రం దర్వాజాకు చేరబడి జోగుతూ వుంది.

షణ్ముఖం భార్యకు తగలకుండా లోపలకు వచ్చాడు. అలికిడికి ఆదిలక్ష్మి కళ్ళు తెరిచింది. భర్తను చూసి లేచి నిల్చుంది.

“ఏమండీ!” ఆదిలక్ష్మి ఏడుపు గొంతు.

షణ్ముఖం కసిగా వెళ్ళి తలుపులు బిగించుకున్నాడు.

మూసుకున్న తలుపుల కేసి చూస్తూ నిట్టూర్పు విడిచింది.

*    *    *

“ఒరేయ్ పెదబాబూ! మీ నాన్నను లేపరా ఎనిమిది దాటింది. ఇంకా నిద్రేమిటి!” కొడుకుని పిల్చి అన్నది ఆదిలక్ష్మి.

ప్రసాదు తలుపు కొట్టాడు. తలుపులు తెరుచుకున్నాయి. తండ్రి పడుకునే నులక మంచం ప్రసాదు ముఖం లోకి బోసిగా చూసింది.

"అమ్మా? నాన్న కన్పడ్డంలేదు?" బిక్క మొహంతో అన్నాడు ప్రసాదు.

ఆదిలక్ష్మి మాటా పలుకూ లేకుండా కుప్పకూలి పోయింది.

"ఓరే నాయనా! ఏమైపోయావురా" తల్లి రాగాలు పెట్టసాగింది.

మధ్యాహ్నం పోలీసులు వణుక్కుఖం ఇంటిని ముట్టడించారు. ఇల్లూ, దొడ్డి అంతా సోదా చేశారు. ఇంట్లో అడగాల్సిన ప్రశ్నలు అడిగి పోలీసులు వెళ్ళిపోయారు.

వీధి వాకిలి ముందు జనం చేరారు.

"మనిషి చూస్తే బుద్ధిమంతుడిలా కన్పించే వాడు."

"బాగా చదువు కున్నవాడు! ఇదేం పని."

"ఒకటా రెండా ... ఇరవైవేలు ..." తలా ఒక మాట అంటున్నారు.

ఆదిలక్ష్మి బిడ్డల్ని ఒళ్ళో పడుకో బెట్టుకొని కుళ్ళి కుళ్ళి ఏడుస్తూవుంది.

తల్లి మంగమ్మ గుండెలు బాదుకుంటూ భోరు భోరున ఏడుస్తూ వుంది.

మూడోరోజు రాత్రి ఆదిలక్ష్మి అన్నయ్య రంగనాథం విజయవాడ నుంచి వచ్చాడు.

"అన్నయ్యా!" అన్నను చుట్టుకొని ఆదిలక్ష్మి గుండెలు పగిలేలా రోదించింది.

"ఊరుకో అమ్మాయ్! ఏం చేస్తాం రేపు కృష్ణా ఎక్స్‌ప్రెసుకు వెళ్దాం. సామాను సదు!" అన్నాడు రంగనాథం.

"నీ సంసారమే అంతంత మాత్రంగా వుండే ఇంత మందినీ తీసుకెళ్ళి సుఖ్వేం చేస్తావ్ అన్నయ్యా?" ఏడుస్తూనే అన్నది.

"పోయిన వాడు పోయినా - గుడ్డిలో మెల్లగా ఒక దారి చూపించి పోయాడులే. నీ బిడ్డలుచదువుకొని ప్రయోజకులు అయిందాకా సుఖంగా బతకొచ్చులే!" చెల్లెలి చెవి దగ్గిర చిన్నగా అన్నాడు రంగనాథం.

ఆదిలక్ష్మి కృతజ్ఞతతో కోరిదానిలా అన్నయ్య ముఖంలోకి చూసింది.

"ఊం త్వరగా సామాను సర్దుకో! మళ్ళీ చీకటితోనే లేవాలి." అన్నాడు రంగనాథం.